‘సర్వే’జనా సుఖినోభవంతు

- జిల్లాలో కొనసాగుతున్న ఎన్‌సీడీ 3.0 సర్వే
- ఇప్పటి వరకు 1,03,062 మందికి స్క్రీనింగ్ పరీక్షలు
- 36,641 ఇళ్ల సర్వే పూర్తి
- 871 క్యాన్సర్ అనుమానిత కేసుల గుర్తింపు
- అధికమవుతున్న షుగర్ వ్యాధిగ్రస్తులు
- ముందస్తు గుర్తింపుతో వైద్య చికిత్సకు అవకాశం


కానాలలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గోస్పాడు: క్యాన్సర్.. ప్రజల ప్రాణాలను హరించి వేసే మహమ్మారి. చాలా మందికి ఆ వ్యాధి వచ్చిందని తెలిసేలోగా మృత్యుఒడిలోకి చేరుతున్నారు. క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల మరణాల సంఖ్య పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య పరిస్థితిని ముందుగా గుర్తించేందుకు నవంబర్ 14వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) ప్రోగ్రాంను చేపడుతున్నారు. ఎన్‌సీడీ అనగా అసంక్రమిత వ్యాధులు అని అర్థం. అసంక్రమిత వ్యాధులు అంటే అంటు వ్యాధులతో సంబంధం లేని బీపీ, షుగర్, క్యాన్సర్, కిడ్నీ, గుండె తదితర జబ్బులు. ఈ ప్రోగ్రాం కింద వ్యాధులను ముందుగానే పసిగట్టడానికి చర్యలు చేపట్టారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి నడుంబిగించారు. ఇప్పటి వరకు చేపట్టిన సర్వేలో ప్రజల ఆరోగ్య సమస్యలు వెలుగు చూస్తున్నాయి.

మూడేళ్ల నుంచే సర్వే

ఎన్‌సీడీ సర్వే తొలిసారి 2021 అక్టోబర్‌లో మొదలు పెట్టారు. రెండో విడతగా 20022 అక్టోబర్ 2 నుంచి ఎన్‌సీడీ 2.0, తాజాగా నవంబర్ 14వ తేదీ నుంచి ఎన్‌సీడీ 3.0 సర్వే జరుగుతోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటికి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు.

పరీక్షలు ఇలా

వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్ల నిండిన వారికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తారు. ముఖ్యంగా మహిళలకు ఆరోగ్య సమస్యలు, నెలసరి వివరాలు, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్ వంటి సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ఈ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు చేస్తారు. విద్యార్థులకు పాఠశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరం అయితే ఆరోగ్యశ్రీ కింద ఇతర నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. ఇక బీపీ, షుగర్ తదితర వ్యాధులకు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, 104 సంచార వైద్య శాలల ద్వారా చికిత్స అందిస్తున్నారు.

నంద్యాల జిల్లాలో వివరాలు ఇలా	
మొత్తం జనాభా :	19,14,275
గృహాల సంఖ్య :	5,85,706
సర్వే పూర్తి చేసిన గృహాల సంఖ్య :	36,641
సచివాలయాల సంఖ్య :	516
18ఏళ్లు నిండిన వారు :	14,07,670
స్క్రీనింగ్ పరీక్షలు పొందిన వారు :	1,03,062

జిల్లాలో 3.0 సర్వే వివరాలు ఇలా..

ఇప్పటి వరకు జిల్లాలో 1,03,062 మందికి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేశారు. వారిలో 9419 మందికి బీపీ, 6926 మందికి షుగర్ వ్యాధి నిర్ధారించారు. అలాగే క్యాన్సర్ అనుమానితులుగా గర్భాశయ ముఖద్వార లక్షణాలు కలిగిన 348మంది, రొమ్ము క్యాన్సర్ 290మంది, నోటి క్యాన్సర్ 233 మందికి అనుమానిత లక్షణాలు ఉన్నట్లు సర్వేలో గుర్తించామని వైద్యాధికారులు చెబుతున్నారు.

సర్వే ద్వారా వెలుగు చూస్తున్న వ్యాధులు

తాజాగా నిర్వహిస్తున్న సర్వేలో బీపీ, షుగర్‌తో పాటు గర్భాశయ ముఖ ద్వారం, రొమ్ము, నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో ముందు వరుసలో బీపీ తరువాత స్థానంలో మధుమేహం ఉంది. అనుమానిత జాబితాలో గర్భాశయ ముఖ ద్వారం క్యాన్సర్, రొమ్ము, నోటి క్యాన్సర్ ఉన్నట్లు సర్వేలో వెల్లడవుతున్నాయి. బీపీ, షుగర్ వ్యాధులను నియంత్రణలో ఉంచుకోకపోతే శరీరంలో ప్రధాన భాగాలైన కళ్లు, కిడ్నీ, గుండె, నరాలు తదితర భాగాలు దెబ్బతింటాయి. అలాగే మద్యపానం, పొగ తాగడం, గుట్కాలు తదితర వ్యసనాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

సిబ్బందికి సహకరించాలి



జిల్లాలో నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలి. వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి ఆరోగ్యపరమైన విషయాలు అడిగితే నిర్భయంగా వివరాలు చెప్పండి. ముందుగా క్యాన్సర్ వంటి వ్యాధులను గుర్తించడం ద్వారా చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. ఈ సర్వే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. –కాంతరావునాయక్, జిల్లా ఇన్‌చార్జి ప్రోగ్రాం అధికారి, నంద్యాల

ముందస్తుగా గుర్తిస్తే నయం



క్యాన్సర్ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మారిన జీవన శైలి, దూమ, మద్యపానాలు, పొగాకు సేవనం, వంశపారంపర్యం వంటి కారణాల వల్ల కేసుల సంఖ్య ఎక్కువవుతోంది. ఈ వ్యాధిని ముందే గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించి నయం చేసే అవకాశం ఉంది. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. పరీక్షలపై ఎలాంటి అపోహలు అవసరం లేదు. –వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


చిన్నారులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 3వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అన్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహార కిట్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ చేపట్టారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయడం హర్షణీయం


మస్తాన్‌వలిని సన్మానిస్తున్న సభ్యులు

నంద్యాల(అర్బన్): దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయడం హర్షణీయమని ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ జోనల్ ఇన్‌చార్జి ఫయాజ్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో దివ్యాంగులకు సేవలందిస్తున్న వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాల్‌మిల్లు అమీర్, న్యాయవాది అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి


మంత్రులకు వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు

నంద్యాల(అర్బన్): జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ పక్కాఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఖండే శ్యామ్‌సుందర్‌లాల్ కోరారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు నంద్యాలకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌కు నంద్యాల జర్నలిస్టుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ కోసం స్థలం కేటాయింపుతో పాటు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నంద్యాల(వ్యవసాయం): బహుభాష కోవిదుడు, దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహాన్ని నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యదర్శి నగరజోన సుదీర్ అన్నారు. మంగళవారం న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు


ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12వ తేదీ నుంచి ఎల్‌ఎస్‌డీజీఎస్ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులకు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు బ్యాచ్‌లుగా విభజించి మొదటి బ్యాచ్‌కు ఈ నెల 12, 13వ తేదీల్లో, రెండో బ్యాచ్‌కు 17, 18 తేదీల్లో శిక్షణ ఉంటుందన్నారు. అందరూ తప్పక హాజరుకావాలని సూచించారు.

భూసమస్యల పరిష్కారానికి మంచి అవకాశం


దొర్నిపాడు: మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర


చాగలమర్రి: శెట్టివీడు రెవెన్యూ సదస్సులో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

దొర్నిపాడు: భూ సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు మంచి అవకాశం అని తహసీల్దార్ సుభద్ర అన్నారు. మంగళవారం దొర్నిపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా రెవెన్యూ సదస్సులపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. భూ సమస్యలపై నలుగురు రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, ఈఓ చంద్రుడు, వీఆర్‌ఓ నాగేష్, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మాయలూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో 943 మంది రైతులకు చెందిన 4,433 ఎకరాల్లో రీ–సర్వే నిర్వహించాల్సి ఉందని.. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. కొలతలు, సర్వే నంబర్లలో తేడాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓ వెంకటలక్ష్మి, దేవదాయ శాఖ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

చాగలమర్రి: భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి స్పందన కరువైంది. మంగళవారం చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామంలో సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన నల్లంశెట్టి సురేంద్రనాథ్, పూల రఫీ భూసమస్యలపై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని కోర్టులోనే తేల్చుకోవాలని అధికారులు సమాధానం ఇవ్వడంతో అవక్కాయ్యారు. ఈ సంబరానికి రెవెన్యూ సదస్సులు ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి స్కై పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి స్కై పోటీల్లో నంద్యాల జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆంధ్రప్రదేశ్ స్కై చైర్మన్ ఇస్మాయిల్, నజీర్, సెక్రటరీ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా మంగళవారం తెలిపారు. ఈనెల 7, 8, 9, 10 తేదీల్లో హర్యానాలో స్కై ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 25వ జాయతీ స్థాయి పోటీల్లో నంద్యాల జిల్లా నుంచి 13 మంది పాల్గొన్నారు. వీరిలో ఒకరు బంగారు, ముగ్గురు వెండి, నలుగురు కాంస్య పతకాలు సాధించినట్లు వెల్లడించారు. ఈ పోటీలకు 24 రాష్ట్రాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. అండర్ 11 విభాగంలో సీహెచ్ దుర్గా, విజ్ఞాన బంగారు పతకం, 18 కేజీల విభాగంలో మహమ్మద్ అహన్, అండర్–14 బాలురు 33 విభాగంలో ఎస్‌ఎండీ అయాన్ వెండి పతకాలు సాధించారు. అండర్–18లో అఫ్జల్ హుసేన్ కాంస్య పతకం, కవాంకీ కేవన్ విభాగంలో నానివర్ధన్ వెండి పతకం, కే–2 విభాగంలో విన్సెంట్ జాయ్, ఎరోస్కియా విభాగంలో సైపుల్లా, సాహిద్ కాంస్య పతకాలు సాధించారన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


దొర్నిపాడు: బాల్యవివాహాలపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు


ఉయ్యాలవాడ: మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి తేజస్విని

దొర్నిపాడు: బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, ప్రతి నలుగురిలో ఒకరు బాల్యవివాహాలకు గురవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయని ఎంపీడీఓ సావిత్రి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ తేజశ్వని అధ్వర్యంలో కిశోరి వికాసంపై మండలస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలు, జీవననైపుణ్యాలు, లైంగికదాడుల నుంచి ఎలా సంరక్షించుకోవాలనే అంశాలపై వివరించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు పాఠశాలలకు వెళ్లి బాలికలకు అవగాహన కల్పించాలని ఎంఈఓ మనోహర్‌రెడ్డి సూచించారు. బాల్యవివాహలు చేస్తున్నట్లు తెలిస్తే అంగన్‌వాడీ కార్యకర్తలు సమాచారం ఇవ్వాలని సీడీపీఓ తేజశ్వని సూచించారు. ఈఓపీఆర్డీ సులోచన, వెలుగు ఏపీఎం బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ పాల్గొన్నారు.

చట్టరీత్యా నేరం

గోస్పాడు: బాల్య వివాహాలను నిరోధించాలని సీడీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఈఓఆర్డీ నాగఅనసూయ, సూపర్ వైజర్లు కుమారి, హేమలత ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలన్నారు. బాల్య వివాహాలు చేసినా ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చిన్నపిల్లలకు పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత

ఉయ్యాలవాడ: కౌమార బాలికల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శిశుసంక్షేమ శాఖ ఐసీడీఎస్ ఆళ్లగడ్డ ప్రాజెక్ట్ అధికారిణి తేజస్విని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181 ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. మహిళలు, శిశువుల్లో పౌష్టికాహారం లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, తదితర ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధిగమించవచ్చని సూచించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి పాల్గొన్నారు.



గోస్పాడు: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని నీటి ప్రాజెక్టులు, చెరువుల మరమ్మతు పనులకు నిధులు విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అలగనూరు రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని కోరారు. కాంట్రాక్ట్ పనుల్లో అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరింపజేయాలని, వరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, పట్టణ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

సుద్దమల్లలో వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ: గ్రామాల్లో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వినోద్‌కుమార్ అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మంగళవారం మండలంలోని సుద్దమల్ల గ్రామానికి ఉయ్యాలవాడ వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది 104 వాహనంలో చేరుకుని ప్రజలకు వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న 62 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు, చిన్నారులకు పరీక్షలు చేసి రక్తహీనత లోపం ఉన్న పిల్లలను గుర్తించి ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. సాయంత్రం గృహాలకు పరిమితమైన వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, ఏఎన్‌ఎమ్‌లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మిశ్రమ పంటలతో లాభదాయకం



దొర్నిపాడు: గుండుపాపలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ



గోస్పాడులో..

దొర్నిపాడు: ఒకే పంటపై రైతులు ఆధారపడకుండా మిశ్రమ పంటలు సాగు చేయాలని ఏడీఏ సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండుపాపల, క్రిష్టిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి మిశ్రమ పంటలతో నికరలాభాలు పొందవచ్చన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఒక పంటపోయినా మరో పంట చేతికి వస్తుందన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. లేకపోతే భూమిలో సారం తగ్గిపోయి భవిష్యత్ తరాలకు వ్యవసాయం దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రమీల, పశువైద్యాధికారి పావని, సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంట నమోదుతో అనేక ప్రయోజనాలు

గోస్పాడు: రబీలో సాగు చేస్తున్న పంటలకు ఈ–క్రాప్ చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి, డీఆర్‌సీ ఏఓ ప్రభావతమ్మ అన్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా పంట నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా వర్తిస్తుందన్నారు. నష్ట పరిహారం, సున్నావడ్డీ, ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నా ఈ పంట నమోదు తప్పనిసరి అన్నారు. అనంతరం గ్రామంలో మినుము పంటను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు.

మెలకువలు పాటించండి


రుద్రవరం: మొక్కజొన్న రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

రుద్రవరం: సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాదు అన్నారు. రుద్రవరం, ఆర్.నాగులవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రంలో ఆయన మాట్లాడారు. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిందని వివరించారు. ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట కోతలను నిలిపివేయాలని తెలిపారు. ఆరబోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టలు కప్పాలని చెప్పారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

నంద్యాల(న్యూటౌన్): ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారన్నారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తూ మంత్రికి విన్నవించుకోవాలని వెళ్తున్న కార్యకర్తలను అడ్డుకోవడం తగదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు పరిష్కరించడం లేదన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, అబ్రహాం, లక్ష్మి, ప్రమీల, సుధాలక్ష్మి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!


రహదారిపై రక్షణ గోడలు లేని కల్వర్టు

గోస్పాడు: పసురపాడు–దీబగుంట్ల గ్రామాలకు వెళ్లే రహదారిపై ఎస్.నాగులవరం గ్రామ సమీపంలో పంట పొలాల మధ్య కాల్వకు కల్వర్టు ఏర్పాటు చేసినప్పటికీ రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా సరైన బర్మ్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో పొలాల మధ్య రోడ్డు కింది నుంచి కల్వర్టు ఏర్పాటు చేశారు. అయితే కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో కల్వర్టు కనిపించక ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు దారి ఇచ్చే క్రమంలో బర్మ్ సరిగా లేక కల్వర్టులో పడిపోతున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు, వాహనదారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయంటున్నారు. కల్వర్టుకు రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.